క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, శివ పార్వతులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వెంకటకృష్ణ కిరణ్, వెంకట కృష్ణారావు స్వామి వార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు నిర్వహించారు. ఉభయదాతలు పోలంరాజు నరసింహం కుమారుల ఆధ్వర్యంలో అంకురార్పణ పూజలు చేశారు. మే 3వ తేదీన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం, 6వ తేదీన శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా కంభం చెరువు అభివృద్ధి



కంభం: పాపికొండలను తలపిస్తున్న చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా టూరిజం శాఖాధికారి అద్దంకి రమ్య పేర్కొన్నారు. మంగళవారం గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో కలిసి టూరిజం అధికారులు కంభం చెరువును సందర్శించారు. పడవలో వెళ్లి చెరువు అందాలను తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

గిద్దలూరు రూరల్: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ పీడీ పి.శ్రీనివాసప్రసాద్ సూచించారు. పట్టణంలోని నల్లబండ బజారులోని జగనన్న లేఔట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. నూతనంగా గృహాలు పొందిన ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష అదనంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఖదీర్‌బాషా, ఏఈ మహేష్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా

పొదిలి రూరల్: పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడటానికి ప్రభుత్వం 50 శాతం రాయితీపై పశువులకు సమీకృత దాణాను సరఫరా చేస్తున్నట్లు ఉన్నగురువాయపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. 50 కిలోల దాణా ఖరీదు రూ.1110 కాగా, తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు సబ్సిడీ పోను రూ.555కు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలలు విడతల వారీగా 450 కిలోల దాణా అందిస్తామని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చెస్‌లో మార్కాపురం విద్యార్థి ప్రతిభ


గోల్డ్ మెడల్ సాధించిన కేశవ

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన బచ్చు చెన్నకేశవ ఇండోర్ ఐఐటీలో నిర్వహించిన కాలేజీ స్థాయి చెస్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇండోర్ ఐఐటీలో తృతీయ సంవత్సరం చదువుతున్న కేశవ రెండు రోజుల క్రితం కళాశాలలో నిర్వహించిన పోటీల్లో జార్ఖండ్‌కు చెందిన ఆదిత్యపై విజయం సాధించాడు. గోల్డ్ మెడల్ సాధించిన కేశవను పలువురు అభినందించారు.

ప్రైవేట్ విద్య ఉచితం..
చేసుకోండి సద్వినియోగం

- పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు అవకాశం
- మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- అనాథలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధితులకు ప్రాధాన్యం
- ఒక్కో స్కూల్లో 25 శాతం సీట్ల కేటాయింపు



కంభం: పేద పిల్లలు సైతం ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచితంగా చదువుకునే సౌలభ్యాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. విద్యాహక్కు చట్టం -2009, సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం మంది పేద పిల్లలు చదువుకునేందుకు చర్యలు తీసుకుంది. 2023 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా.. 2025–26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 28 నుంచి మొదలవగా.. మే నెల 15వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది.

పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుంది.

కేటగిరీల వారీగా సీట్ల కేటాయింపు

- ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల (అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు) విద్యార్థులకు 5 శాతం సీట్లు కేటాయిస్తారు.
- షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు 10 శాతం, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు 4 శాతం సీట్లు కేటాయిస్తారు.
- బీసీ, మైనారిటీ, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.1.44 లక్షలకు మించకుండా ఉన్న పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు.

అర్హతలు

- సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ/ఐబీ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.
- స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఐదేళ్ల వయసు నిండి ఉండాలి.
- అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, బీసీ, మైనారిటీలతోపాటు అల్పాదాయ వర్గాల విద్యార్థులు అర్హులుగా ఉంటారు.

అవసరమైన పత్రాలివే..

- ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్ కార్డు/ఓటరు కార్డు/రేషను కార్డు/భూమి యాజమాన్య పత్రం/ఉపాధి హామీ జాబ్ కార్డు/పాస్ పోర్టు/డ్రైవింగ్ లైసెన్సు/విద్యుత్ బిల్లు/రెంటల్ అగ్రిమెంట్(ఇంటి అద్దె) కాపీల్లో ఏవైనా మూడింటిని సమర్పించాలి.
- పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం అందజేయాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

- డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో మే 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.
- గ్రామ/వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాలు లేదా ఇంటర్నెట్ సెంటర్లు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పేద విద్యార్థులకు ఉపయోగకరం



అర్హులైన పేద విద్యార్థులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు సైతం ప్రైవేట్ స్కూళ్లలో ఉచితంగా చదువుకునే అవకాశం కలగడం ద్వారా పేద తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అర్హులైన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి.

– మాల్యాద్రి, మండల విద్యాశాఖాధికారి, కంభం

రేషన్ సరుకులు పక్కదారి పడితే చర్యలు

- జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక


మార్కాపురంలో ఎంఎల్‌ఎస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: పౌరసరఫరాల శాఖ గోడౌన్ నుంచి నిత్యావసర వస్తువులను సక్రమంగా రేషన్ షాపులకు పంపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్ పరిశీలించిన అనంతరం జేసీ మాట్లాడుతూ.. కోటా ప్రకారం ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్‌ను ఆయా మండలాలకు పంపాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా రేషన్ సరుకులు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ చిరంజీవి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి

పొదిలి రూరల్: గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం పొదిలి మండలం అన్నవరం పంచాయతీలోని చింతగుంపల్లి, తలమళ్ల పంచాయతీలోని లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో భూ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ.. గ్రామంలో రైతులకు సమాచారం అందించి పారదర్శకంగా సర్వే చేపట్టాలన్నారు. సర్వే నివేదికను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సర్వేలో రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ నరసింహారావు, వీఆర్వోలు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పొదిలి: పట్టణంలోని పలు ప్రాంతాలను జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక శ్రీరాఘవేంద్ర సినిమా థియేటర్, వారి యాజమాన్యంలో నడుస్తున్న వాటర్ ప్లాంట్, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో రికార్డులు పరిశీలించారు. గ్యాస్ గోడౌన్‌లో నిల్వలను చెక్ చేశారు. సినిమా థియేటర్‌లో అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్, నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, డీటీ, వీఆర్‌ఓలు ఉన్నారు. స్థానిక మార్కాపురం రోడ్డులోని రేషన్ బియ్యం గోడౌన్, కరుణా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, 22వ నంబర్ రేషన్ దుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఎఫ్‌ఐ శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డేవిడ్, స్థానిక డీటీ షాజిదా, ఆర్‌ఐ నరసింహారావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో సినిమా థియేటర్లు, గ్యాస్ గొడౌన్‌లు, పెట్రోల్ బంకులు నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తామని తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లోపాలను గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పది రోజుల్లో మళ్లీ తనిఖీకి వస్తానని అప్పటికి సక్రమంగా లేకుంటే ఉన్నతాధికారులకు సిఫార్సు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పాలిసెట్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని కేంద్రాల్లో బుధవారం పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు జార్జి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ కాలేజీ సాంకేతిక సలహాదారు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. గిద్దలూరు, దోర్నాల, యర్రగొండపాలెం, మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యే విద్యార్థుల కోసం బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గిద్దలూరు ప్రాంతం వారు పుష్పకుమార్ 73866 26904ను, దోర్నాల ప్రాంతానికి చెందిన వారు 82473 98357ను, యర్రగొండపాలెం ప్రాంత విద్యార్థులు సురేష్‌కుమార్ 99660 10015ను, త్రిపురాంతకం ప్రాంత విద్యార్థులు జయదేవ్ 90000 94136ను సంప్రదించాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ సి.దేవరాజ్, మార్కాపురం కోఆర్డినేటర్ ప్రభాకర్, స్పెషల్ అబ్జర్వర్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మార్కాపురం పట్టణంలో కోఆర్డినేటింగ్ సెంటరైన జార్జి ఇంజినీరింగ్ కళాశాల, సాధనా కళాశాల, జెడ్పీ బాయ్స్, గరల్స్ హైస్కూల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ గిరిధరశర్మ

రాచర్ల: ఇటీవల వెల్లడించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 28 నుంచి మే 18వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో–2 వారణాసి గిరిధరశర్మ మంగళవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఫెయిలైన విద్యార్థులంతా ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మే 19 నుంచి నిర్వహించనున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం బీఎల్ రామ్‌నాయక్, సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుమీదే తాగేస్తున్నారు..


ఆరుబయట మద్యం తాగుతున్న యువకులు

మార్కాపురం: పట్టణంలోని పేరం బజారులో కొంత మంది యువకులు ఆరుబయట మద్యం తాగుతున్న వైనం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత కొన్నిరోజులుగా కొంత మంది మద్యం బాటిళ్లను తెచ్చుకుని రోడ్డుపైనే తాగుతున్నారు. దీంతో ఆ చుట్టుపక్కల నివాసముండే మహిళలు, పాఠశాలలో చదువుకునే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా మంగళవారం ఓపెన్ డ్రింకింగ్‌పై కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పోలీసులు స్పందించారు. టూటౌన్ ఎస్సై తమ సిబ్బందితో కలిసి పేరం బజారుకు చేరుకోగా మందుబాబులు పరారయ్యారు. ఎవరైనా ఆరుబయట మద్యం తాగితే తనకు సమాచారం అందించాలని, ఎవరూ భయాందోళనకు గురి కావద్దని స్థానికులకు ఎస్సై సూచించారు.

బాల్యవివాహాలు నిరోధించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

కొమరోలు: బాల్యవివాహాలను నిరోధించేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. బాలికల రక్షణ, భద్రత, వారిలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కామూరి అమూల్య, ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు, ఏపీఎం రఘునాథబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటికకు రూ.50 వేలు సాయం

తర్లుపాడు: స్థానిక హిందూ శ్మశానవాటికకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ యువ నాయకులు మహీధర్‌రెడ్డి చెరో 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సామాజిక కార్యకర్త కొశ్నెట్టి జగన్‌బాబు అందించారు. ఈ సందర్భంగా దాతలను శ్మశాన కమిటీ సభ్యులు అభినందించారు.

ఉగ్రదాడులకు వ్యతిరేకంగా నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న వినియోగదారుల సంఘం సభ్యులు

కొమరోలు: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మండల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో కొమరోలులో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. వినియోగదారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అమాయకమైన పర్యాటకులను అన్యాయంగా చంపడం హేయమైన చర్య అన్నారు. మతం పేరుతో యాత్రికులను అన్యాయంగా చంపిన ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఖాజావలి, దివాన్‌బాషా, బ్లస్సింగ్‌టన్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీను మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా, పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి 'అన్నా' నివాళి

తర్లుపాడు: మండలంలోని ఉమ్మారెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త నాగం శ్రీను అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మీర్జపేటలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షులు టి.రంగారెడ్డి మేనమామ కె.చిన్న వెంకట సుబ్బారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, స్థానిక నాయకులు బాల గురవారెడ్డి, రామాంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపాల్, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సర్పంచ్ అంజయ్య, వైస్ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రామిరెడ్డి, కాశయ్య, ఎంపీటీసీ రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, బీసీ నాయకులు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


బేస్తవారిపేటలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు


గిద్దలూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథపాలకురాలు

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ పీవీ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులకు 25 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

గిద్దలూరు రూరల్: వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయంలో శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ లైబ్రేరియన్ ప్రసన్నకుమారి సూచించారు. విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకునేందుకు పుస్తకాలు చదవాలని చెప్పారు. వేసవి శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ సివిల్స్ సర్వీస్ రూల్స్ చట్టాన్ని ఉపసంహరించాలి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్


మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ సివిల్స్ సర్వీస్ రూల్స్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ సివిల్ సర్వీస్ 1972 రూల్స్ సవరణ చేసిందని, దీని ప్రకారం పీఆర్సీ కేవలం ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వారికి మాత్రమే వర్తిస్తుందని గతంలో రిటైర్డ్ అయిన వారికి ఎలాంటి పీఆర్సీ అమలు కాదన్నారు. దీంతో పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవితం మొత్తం ప్రభుత్వ రంగాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. త్వరలో లక్ష మందితో కార్డు క్యాంపెయిన్ నిర్వహించబోతున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, ఎం.రంగయ్య, వెంకటస్వామి, బి.పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన సేవలందించండి


శ్రీకృష్ణ, హేమలతను సన్మానిస్తున్న ఎన్‌జీఓ సంఘు నాయకులు

మార్కాపురం టౌన్: జిల్లా ట్రెజరీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా మార్కాపురం సబ్‌ట్రెజరీ అధికారి శ్రీకృష్ణ, జిల్లా మహిళా కార్యదర్శిగా హేమలత ఎన్నికకావడం అభినందనీయమని ఎన్‌జీఓ మార్కాపురం తాలూకా యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, వడ్లమాని శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ట్రెజరీ కార్యాలయంలో ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు మంచి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహన్‌రావు, రామసుబ్బారెడ్డి, మల్లికార్జున్, రెహమాన్ పాల్గొన్నారు.

గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు


కూల్‌డ్రింక్ షాపును తనిఖీ చేస్తున్న టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్: గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌటూన్ ఎస్సై రాజమోహన్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఏకలవ్యకాలనీ, డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కిరణా, కూల్‌డ్రింక్ షాపులను తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో సుందరయ్య కాలనీ, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం కలిగి ఉన్నా, అమ్మినా జైలు శిక్ష తప్పదని దుకాణాల నిర్వాహకులకు స్పష్టం చేశారు.